క్లుప్తంగా

ఎల్లమ్మకు డాక్టరేట్



తిరుపతి సిటీ : చరిత్ర విభాగం పరిశోధక విద్యార్థిని కొమ్మా ఎల్లమ్మకు ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ జి.విజయ్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఏ హిస్టారికల్ స్టడీ ఆఫ్ ఫెమినిస్ట్ మూమెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

విజ్ఞాన తరగతులతో ఉపయోగం

పాకాల : వేసవి శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత విజ్ఞాన తరగతులతో విద్యార్థులకు ఉపయోగకరమని దామలచెరువు శాఖా గ్రంథాలయ సహాయకుడు మురళీబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక గ్రంథాలయంలో జూన్ 6వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 11గంటల మధ్య విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కథలు చదవడం, పుస్తక పఠనం, జీకే క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్ నేర్పిస్తున్నట్లు వివరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ పరీక్షకు మంచి స్పందన

తిరుపతి సిటీ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోకరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన నీట్, ఈఏపీ సెట్ మోడల్ పరీక్షలకు మంచి స్పందన లభించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అక్బర్, రవి మాట్లాడుతూ నీట్, ఈఏపీసెట్ మోడట్ పరీక్షలకు వేల సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు శివ, బాబ్జి, తేజ, డేవిడ్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు



మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

చంద్రగిరి : స్థానిక గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. చంద్రగిరి జెడ్పీ పాఠశాల అధికారి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. క్యాంపులో డ్రాయింగ్, పెయింటింగ్, ఇండోర్ గేమ్స్ ఉంటాయని, విజేతలకు బహుమతులు అందిస్తామని వెల్లడించారు. లైబ్రేరియన్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 45 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ అమరయ్య

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 45 వినతులు వచ్చినట్లు ఇన్‌చార్జి కమిషనర్ అమరయ్య తెలిపారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 36మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారని వెల్లడించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎంఈలు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే లక్ష్య సాధన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : ఏకాగ్రతతోనే లక్ష్య సాధన సాధ్యమని రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి తెలిపారు. సోమవారం రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సంస్కార శిబిరాన్ని ప్రారంభించారు. డీఎస్పీ జి.బాలిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విలువలు అందించాలని రామకృష్ణ మిషన్ ప్రయత్నిస్తోందని కొనియాడారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ వేదాలలో మన సంస్కృతిని వివరించారని వెల్లడించారు.

రుయాలో విద్యుత్ లేక రోగుల ఇక్కట్లు

తిరుపతి తుడా : రుయాలో సోమవారం మూడు గంటల పాటు విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కరెంట్ కోత ఉద్యోగులు, రోగులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ లేకపోవడంతో రోగులు, ఆస్పత్రి సిబ్బంది నానా అవస్థలు పడ్డారు.

కలెక్టర్‌తో ట్రైనీ ఐఏఎస్ అధికారి



కలెక్టర్‌తో సందీప్ రఘువంశీ

తిరుపతి అర్బన్: ట్రైనీ ఐఏఎస్ అధికారి సందీప్ రఘువంశీ సోమవారం కలెక్టరేట్ లో కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మురిపించే ముంజె!





వేసవి తాపం నుంచి ఉపశమనానికి తాటి ముంజెలు ఉపయోగపడతాయి. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా సేద తీరుస్తాయి. ఈ మేరకు నగరంలో తాటి ముంజెల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధాన కూడళ్లు.. ఫుట్‌పాత్‌లపై భారీగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. సోమవారం ఈ క్రమంలో తిరుపతిలోని పలు ప్రాంతాల్లో తాటి ముంజెల విక్రయాలు ఊపందుకున్నాయి. **- సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి**

అమ్మా.. అప్రమత్తం



వేసవి నేపథ్యంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. సాధ్యమైనంత వరకు ప్రయాణాలు తగ్గించాలని స్పష్టం చేశారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా నిత్యం 5 లీటర్ల వరకు ద్రవ పదార్థాలు సేవించాలని వెల్లడిస్తున్నారు. చర్మం చిట్లడం.. దురదలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్నానం చేసి కొబ్బరి నూనె రాసుకోవాలని చెబుతున్నారు. వదులుగా ఉండే దుస్తులు ధరించాలని కోరుతున్నారు. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని తెలియజేస్తున్నారు. వేపుళ్లు.. చిరుతిళ్లు.. కాఫీ.. టీ.. శీతల పానీయాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. నీటిశాతం అధికంగా ఉండే పండ్లు భుజించాలని వివరిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని కోరుతున్నారు. **- తిరుపతి తుడా**

నోటీస్ బోర్డు

- తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడో మంగళవారం సందర్భంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం.
- పద్మావతిపురంలోని భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నగర ప్రచార విభాగం నూతన కమిటీ ప్రమాణస్వీకారం.
- ఎస్వీయూ పరిపాలన భవనం వద్ద ఉదయం 10 గంటలకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో నిరసన.
- చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు వావిలాల గోపాలకృష్ణయ్య 22వ వర్ధంతి కార్యక్రమం.
- రుయా ఆస్పత్రి వద్ద ఉదయం 11 గంటలకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో ధర్నా.

నిబంధనలకు నీళ్లు!

నగరంలో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. డిమాండ్ మేరకు ఇష్టారాజ్యంగా తాగునీటి విక్రయాలు సాగిస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలను యథేచ్ఛగా గాలికి వదిలేస్తున్నాయి. పరిశుద్ధ జలం అంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేస్తున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి కార్పొరేషన్ పరిధిలో గల్లీకో నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దాహార్తి తీరుస్తున్నామంటూ కాసుల పంట పండిస్తున్నారు. నగరవాసులకు సురక్షిత జలం అందించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా పలువురు వ్యాపారులు అపరిశుభ్రమైన నీటినే అధిక ధరలకు అమ్మేస్తున్నారు.

- శుద్ధ జలం పేరుతో ప్రజారోగ్యంతో చెలగాటం
- గల్లీకో ప్లాంట్ పెట్టి యథేచ్ఛగా వాటర్ క్యాన్ల విక్రయం
- నాణ్యత లేకపోయినా పట్టించుకోని యంత్రాంగం
- వేసవిలో ధరలు ఇష్టారాజ్యం
- నగరంలో రోజూ రూ.లక్షల్లో వ్యాపారం





సింథటిక్ ట్యాంకులతో నీటి వ్యాపారం చేస్తున్న దృశ్యం

తిరుపతి తుడా : తిరుపతి నగరంతో పాటు రూరల్ ప్రాంతాలలో నీటి శుద్ధి ప్లాంట్లు పెద్దసంఖ్యలో వెలిశాయి. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలను తుంగలో తొక్కి పలువురు వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అధికారుల అలసత్వమే శ్రీరామ రక్షగా నిత్యం రూ.లక్షల్లో నీటి వ్యాపారం సాగిస్తున్నారు.

ప్రమాణాలేవి..?

నగర పరిధిలో సుమారు 5వేలకు పైగా ప్రైవేటు నీటి శుద్ధి ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో కనీసం 10 శాతం ప్లాంట్లకు సైతం అనుమతులు లేవు. ప్రధానంగా ప్లాంట్ ఏర్పాటు చేసేవారు ట్రేడ్, ఫుడ్ లైసెన్సులు పొందాలి. బీఐఎస్ సర్టిఫికెట్ తప్పనిసరి, నీటి శుద్ధికి నాణ్యమైన యంత్రాలు అమర్చుకోవాలి. సింథటిక్ ట్యాంకులు కాకుండా స్టీల్ ట్యాంకులలో నీటిని నిల్వ చేసుకోవాలి. శుద్ధి పరిచిన నీటికి ప్రతి రోజు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలి. వాటర్ ప్లాంట్లను నిత్యం పరిశుభ్రం చేయాలి. ఈ ప్రక్రియను ప్రజారోగ్య విభాగం, ఆహార కల్తీ నిరోధక శాఖ సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ చేయాల్సి ఉంది. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు విచ్చలవిడిగా నాణ్యత లేని నీటిని సరఫరా చేస్తూ రోజూ రూ.లక్షలు దండుకుంటున్నారు.

అధిక ధరలు.. రూ. కోట్లలో వ్యాపారం

అనధికారికంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల వ్యాపారం నగరంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. స్వచ్ఛత, శుభ్రతతో పని లేకుండా వాటర్ క్యాన్ నింపి ప్రజల నుంచి కాసులు వసూలు చేసుకుంటున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల యజమానులు త్రిచక్రవాహనంలో సింథటిక్ ట్యాంకులను ఏర్పాటు చేసుకుని వీధి వీధికీ తిరుగుతూ నీటి వ్యాపారం చేసుకుంటున్నారు. సాధారణ 20లీటర్ల క్యాన్ ధర రూ.15 నుంచి రూ.20వరకు విక్రయిస్తున్నారు. అలాగే కూల్ వాటర్ క్యాన్ ధర రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముతున్నారు. నగరంలో సాధారణంగా రోజుకు రూ.15లక్షలకు పైగా వ్యాపారం జరుగుతోంది. వేసవి కాలం రావడంతో ఈ సంఖ్య రూ.30లక్షలు పైగా చేరుకున్నట్లు అంచనా. దీంతో కేవలం వారం రోజులోనే సుమారు రూ.5కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోందని అధికారులే వెల్లడిస్తున్నారు.

అప్రమత్తత అవసరం

నగరంలో విచ్చల విడిగా శుభ్రత లేని వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్లు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై వెంటనే దృష్టి సారించకుంటే కనీసం స్వచ్ఛమైన తాగునీరు కూడా అందుబాటులో ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అప్రమత్తం కావాలని కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి: పగటి పూట ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డ ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ అయిన సొమ్మును రికవరీ చేసినట్లు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో సీఐ సుబ్బరామిరెడ్డితో కలసి వివరాలు వెల్లడించారు. వారి మాటల్లోనే.. ×తిరుపతి రూరల్ మండలం, ఎంఆర్‌పల్లి పంచాయతీ, శ్రీకృష్ణ నగర్‌కు చెందిన పులినరేష్, పల్నాడు జిల్లా మిర్యాల గ్రామానికి చెందిన షేక్ బాబవల్లిలు ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్ 30వ తేదీన మండల పరిధిలోని కొత్తఇండ్లు గ్రామానికి చెందిన దొమ్మలపాటి సిద్దులు నాయుడు ఇంట్లో ముద్దాయిలు దొంగతానికి పాల్పడ్డారు. ఇంట్లోని 305 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ముద్దాయి పులినరేష్‌ను గుర్తించి, తిరుపతి రూరల్‌లోని తన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా ఈ దొంగతనంలో మరో ముద్దాయి షేక్ బాబవల్లీని తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, మునగాల పోలీసులు జనవరి 7వ తేదీన అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 105.5 గ్రాముల బంగారం, పులి నరేష్ నుంచి చోరీ చేసిన 195.5 గ్రాముల బంగారు, రూ.3 లక్షల నగదును రికవరీ చేశారని పోలీసులు తెలిపారు. దీంతో పాటు బెంగళూరు, బీమానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీ చేసిన స్కూటీని స్వాధీనం చేసుకుని, ముద్దాయిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ముద్దాయి ఇంత ముందు కూడా జైలు జీవితం గడిపినట్లు డీఎస్పీ తెలిపారు. కేసులో మొత్తంగా 301 గ్రాముల బంగారు, రూ.3లక్షల నగదును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట ఎస్ఐ అనితతో పాటు సిబ్బంది ఉన్నారు.

మద్యాలయం!



సరస్వతీ నిలయంగా విలసిల్లే ప్రతిష్టాత్మక ఎస్వీయూనివర్సిటీ ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారింది. దీనిపై పలుమార్లు కథనాలు ప్రచురించినా.. అధికారులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో మద్యాలయంగా మారిపోయింది. ప్రధానంగా ఐఏఎస్‌ఈ భవనం, ప్రకాశం భవనం ఎదుట ఓపెన్ ఆడిటోరియం పరిసరాల్లో ఎటు చూసినా మద్యం సీసాలే కనిపిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యాలయమా.. బార్ అండ్ రెస్టారెంటా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ ట్రాక్టర్ ట్రక్‌లో పట్టేంత స్థాయిలో మందు బాటిళ్లు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు స్పందించి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. **- తిరుపతి సిటీ**

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతులకు ఖచ్చితంగా పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ పరిధిలో పరిష్కరించాల్సిన 9 అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. అందులో పేరూరులో జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి లైటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే విద్యుత్ శాఖకు సంబంధించి రెండు అర్జీలు, హౌసింగ్ శాఖకు సంబంధించి ఒక అర్జీ, నీటి సమస్య పరిష్కరించాలని నాలుగు అర్జీలు రావడంతో వాటిని పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారువైస్ ఎంపీపీలు మాధవరెడ్డి, యశోద, ఎంపీడీఓ రామచంద్ర, హౌసింగ్ డీఈ శ్రీరాములు రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఎర్రావారిపాళెం మండలానికి చెందిన పార్టీ వివిధ కమిటీ నేతలు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజక వర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని సోమవారం కలసి కృతజ్ఞతలు తెలిపారు. నేత చెంగల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గజ మాలతో ఘనంగా సత్కరించారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ నేతలందరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ క్రమంలోనే చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని సైతం సత్కరించారు.కార్యక్రమంలో నేతలు రమేష్ రెడ్డి, చెంగల్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బాజ్జీ, బాబు రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, వీర నాగేంద్ర, మదన మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వసంతబాయి

తిరుపతి అర్బన్: జిల్లాలోని కిశోరబాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామ, వార్డు నుంచి మండల, డివిజన్ స్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయిలో కిషోర్ బాలికలకు అవగాహన కల్పించడంపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ పీడీ వసంతబాయి మాట్లాడుతూ మండలాల వారీగా సమ్మర్ ప్రోగ్రామ్స్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి డాక్టర్ వీ.శివశంకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లలు తీసుకోవాల్సిన పలు అంశాలను తెలియజేశారు.

మామండూరు అడవికి కార్చిచ్చు



మామండూరు అటవీ ప్రాంతంలో మంటలు

చంద్రగిరి: మండల పరిధిలోని మామండూరు సమీపంలోని అటవీ ప్రాంతానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అడవి మొత్తం పొగ కమ్మేసింది. అటవీ అధికారులు స్పందించి మంటలను అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జీతాలకు దిక్కులేదు.. ఇష్టారాజ్యంగా బదిలీలా?



తిరుపతి సిటీ: ఎస్వీయూలో అంతర్గత బదిలీల పరంపర కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ఒత్తిడితో వందల మంది ఉద్యోగులను ఎలా బదిలీ చేస్తారంటూ సోమవారం రాత్రి శాశ్వత, తాత్కాలిక ఉద్యోగ సంఘాల నేతలు వీసీతో పాటు అధికారులను నిలదీశారు. దీంతో కాసేపు వీసీ చాంబర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత 10 నెలలుగా దశలవారీగా సుమారు 350 మంది ఉద్యోగులకు స్థాన చలనం కలిగించిన వర్సిటీ అధికారులు సోమవారం రాత్రి మరో 32 మందిపై బదిలీ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అర్హత లేని వారిని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపించారు. పదేళ్లకు పైగా డీడీఈతో పాటు పలు విభాగాలలో తిష్టవేసిన వారిపై బదిలీలు ఉండవా..? అంటూ సోమవారం రాత్రి ఉద్యోగ సంఘాల నేతలు మండిపడ్డారు.

బోర్ల మంజూరుకు వినతి



ఎంపీపీకి వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ భారతి

తిరుపతి రూరల్ : మండలంలోని సి మల్లవరంలో తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు మంజూరు చేయాలని సర్పంచ్ మొక్కల భారతి తిమ్మారెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, యశోద, ఎంపీడీఓ రామచంద్రకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ వినతి మేరకు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

నిర్లక్ష్య వాహన చోదకులపై ఫిర్యాదు

తిరుపతి లీగల్ : నగరంలో పలువురు ద్విచక్ర వాహన చోదకులు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు సోమవారం ఫిర్యాదు చేసినట్టు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర నేత దొరబాబు తెలిపారు. సైలెన్సర్ తీసేసి ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందిపెడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరినట్లు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను గుర్తించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని సూచించినట్లు వివరించారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉద్యోగ భద్రతకు డిమాండ్



నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

తిరుపతి తుడా : ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎంఎల్‌హెచ్‌పీలు విధులను బహిష్కరించారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీంతో సమ్మెబాట పట్టామని తెలిపారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరసన, ధర్నాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

మందుబాబుల ఘర్షణ

తిరుపతి క్రైమ్: నగరంలోని అమెరికన్ బార్ వద్ద మందుబాబుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఇందులో ఓ వ్యక్తి తలకు బలమైన గాయమైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి వంశీ, తన స్నేహితులు లోకేష్ చిరంజీవితో కలిసి మద్యం సేవించేందుకు ఓ టేబుల్‌ని బుక్ చేసుకున్నాడు. గాలివీధికి చెందిన భావాజాని పక్క టేబుల్‌లో తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఆ సమయంలో లోకేష్ నిలబడి ఉండగా భావాజాన్ తోసుకొని బయటికి వెళ్లాడు. దీంతో వంశీ(33) అడగ్గా నువ్వు ఎవడ్రా అడిగేదానికని అంటూ భావాజాన్ వంశీతో కొడవకు దిగాడు. బావజాన్ కత్తి తీసుకుని వంశీపై దాడి చేశాడు. వంశీ తలకు గాయమైంది. స్థానికులు రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

హెల్మెట్ వినియోగంపై వినూత్న ప్రచారం



ప్రజలకు రోజా పూలు ఇస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: ప్రజలందరూ హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ పోలీసులు రోజా పూలు ఇచ్చి అవగాహన కల్పించారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో 'హెల్మెట్ ధరించండి .. మీ కుటుంబాలను కాపాడండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ట్రాఫిక్ సీఐ సంజయ్‌కుమార్, ఎస్ఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొంతవరకు తగ్గింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేనివారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఏఐఎస్ఎఫ్ విజయంపై హర్షం



మాట్లాడుతున్న చిన్నా

తిరుపతి సిటీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో నిర్వహించిన విద్యార్థి సంఘం ఎన్నికలలో ఏఐఎస్ఎఫ్ ప్యానల్ ఘన విజయం సాధించడంపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్‌కుమార్, చిన్న హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎస్వీయూలో వారు మాట్లాడుతూ విద్యారంగం ప్రైవేటీకరణపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఏఐఎస్ఎఫ్‌కి విద్యార్థులు పట్టం కట్టడం చారిత్రాత్మకమన్నారు. సమావేశంలో నేతలు వేణు, వంశీకృష్ణ, శీను, శ్రీరాములు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో పకడ్బందీగా తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి అర్బన్ : కశ్మీర్ ఉగ్రదాడుల నేపథ్యంలో సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేపట్టారు. డీఎస్ఆర్‌పీ హర్షిత, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల సంచారంపై వెంటనే విచారణ కేంద్రంలో సమాచారం అందించాలని సూచించారు. సహాయం కోసం రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం డాగ్ స్క్వాడ్ సాయంతో తూర్పు నుంచి పడమర వరకు అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు సందీప్‌కుమార్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో జాబ్ అచీవర్స్ డే



విద్యార్థినులతో అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో సోమవారం జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీటీడీ విద్యాశాఖాధికారి టి.వెంకటసునీల్, గౌరవ అతిథిగా సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ ఎ.నిర్మలకుమార్ ప్రియా హాజరయ్యారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు ఆఫర్ లెటర్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పద్మావతమ్మ పాల్గొన్నారు.